
పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇల్లు లేని పేదలకు ప్రభుత్వమే నేరుగా ఇంటి స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐదో రోజు రిలే దీక్ష కొనసాగిస్తున్న గుడిసెవాసులకు బుధవారం ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న పేదల డిమాండ్ న్యాయమైందని, ప్రభుత్వమే పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి.. ప్రతి నిర్మాణానికీ రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న బాధితులకు న్యాయం జరగకపోవడంతో అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.283లో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు పేదల గుడిసెలను కూల్చివేయడం బాధాకరమని, గుడిసెలు కూల్చి వేసినంత మాత్రాన భూ పోరాటం ఆగిపోదని చెప్పారు. ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి శివకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైల్ విస్తరణతో లక్షలాదిమందికి లబ్ధి

- 9న ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రి కెటిఆర్ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ విస్తరణ వల్ల లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుందని మంత్రి కెటిఆర్ అన్నారు. డిసెంబర్ 9న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆ పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎంపి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిజిపి, మెట్రో రైల్, పురపాలక, ఎయిర్‌పోర్ట్ అధికారులతో ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఎయిర్‌పోర్టు వరకు మెట్రో కారిడార్ దోహదపడుతుందని తెలిపారు. శంషాబాద్ నుంచి మొదలుకొని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య ప్రయాణం చేసే లక్షలాది మందికి మెట్రో రైల్ విస్తరణ ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ కీలకమైన కార్యక్రమ శంకుస్థాపనను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 9న శంకుస్థాపన వేసే ప్రాంతంతోపాటు సిఎం కెసిఆర్ పాల్గొనే సమావేశ ప్రాంగణానికి సంబంధించిన ఏర్పాట్లను ఒకటి రెండ్రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి నగరంలోని ట్రాఫిక్, రక్షణ ఏర్పాట్లు, ప్రణాళికలపై కసరత్తు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యేలందరూ కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇందుకోసం నగర ప్రజాప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మంత్రులకు చెప్పారు.

ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా రఘునాథపల్లి పంచాయతీ కార్యదర్శిని ఎసిబి అధికారులు వలపన్ని పట్టుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన పేర్ని మల్లేష్ ఇంటి అనుమతుల మ్యూటేషన్ చేసే విషయంలో రఘునాథపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ముస్కం సంతోష్ డబ్బులు డిమాండ్ చేయడంతో మల్లేష్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వరంగల్ ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ నేతృత్వంలో వలపన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనితోపాటు ఇదే గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది శాగ నగేష్‌నూ ఎసిబి అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపారు.

బాలికపై లైంగికదాడి

ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో ఇద్దరు యువకులు బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక తమ తల్లిదండ్రులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా బాలికను ఇద్దరు యువకులు లైంగికంగా వేధించారని సమాచారం. నిర్భయ కేసులు నమోదవుతున్నా ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇథనాల్ ఉత్పత్తి కంపెనీని రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూరాల ఆర్గానిక్ ఫార్మ్స్, ఆగ్రో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఉత్పత్తి కంపెనీని రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆ కంపెనీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పిడికెడు మంది బడాబాబులు వాడే కార్ల ఇంధనం కోసం విత్తనాలు ఉత్పత్తి అంటూ మొత్తం ప్రజల జీవనాన్ని విధ్వంసం చేస్తున్నారని, దీనిని విరమించుకోవాలన్నారు. పోరాడి సాధించుకున్న కోయిల్‌సాగర్ నీటిని రైతులకు దక్కకుండా తరలించకపోయే అవకాశం ఉందన్నారు. ఈ కంపెనీలో ఇథనాల్ ఉత్పత్తి క్రమంలో విడుదలయ్యే కాలుష్యం, వ్యర్థాలు 32 గ్రామాలకే కాకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణానదికి ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు కార్పొరేట్లకు, డ్రగ్ కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయని విమర్శించారు. భవిష్యత్తులో పర్యావరణ రక్షణ కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైంటిస్ట్ కె బాబురావు, ప్రొఫెసర్లు కె చక్రధర్ రావు, కె లక్ష్మీనారాయణ, గడ్డం లక్ష్మణ్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం వెంకటరాములు, కుల అసమానత నిర్మూలన పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె చక్రవర్తి, చిత్తనూరు యువత మండలి నాయకులు మురళి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు డి చంద్రశేఖర్, టిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం డి ఖలీల్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ నగేష్ మాదిగ పాల్గొన్నారు.

కాళేశ్వరంతో పుష్కలంగా నీళ్లు

- బిజెపి కులమతాల మధ్య చిచ్చు పెడుతోంది
- నూతన మండలం అక్బర్‌పేట-భూంపల్లి ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన నీటితో వేసవికాలం మొదలు నేటి వరకు నిరంతరాయంగా చెక్ డ్యాములు దుంకుతున్నాయని, కూడవెల్లి వాగులో ప్రవహిస్తున్న నీరు ఇక్కడి బిజెపి నాయకులకు కనిపించడం లేదా? కాళేశ్వరం నీళ్లు కనబడడం లేదన్నోళ్లను ఇదే కూడెల్లిల నూకాలే అని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు. కూడవెల్లి జలకళతో ఇక్కడి బోర్లల్లో పుష్కలంగా నీళ్లు వస్తున్నాయని తెలిపారు. ఇదంతా కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలేనని చెప్పారు. అక్బర్‌పేట-భూంపల్లి నూతన మండల ఏర్పాటుకు కృషి చేసింది మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి అని, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లాలో నూతనంగా అక్బర్‌పేట-భూంపల్లి మండలం ప్రారంభోత్సవానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు చిట్టాపూర్ గ్రామం మోతే కమాన్ నుంచి భూంపల్లి బ్రిడ్జి వరకు బైక్ మీద మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపి ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ బిజెపి ప్రభుత్వం దేశాన్ని ఏలుతోందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు చేస్తోంది ఏమీ లేదన్నారు. తెలంగాణలో సిఎం కెసిఆర్ చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను చూసి మహారాష్ట్రలోని ధర్మబాద్, బిలోలి తాలూకాలకు చెందిన 25 మంది సర్పంచులు వారి గ్రామాలను తెలంగాణలో కలపమంటున్నారని వెల్లడించారు. వ్యవసాయ బోరు మోటార్లకు మీటర్లు పెట్టనందుకే కేంద్రం నుంచి తెలంగాణకు వాటాగా రావాల్సిన రూ.12 వేల కోట్లను మోడీ సర్కార్ నిలిపివేసిందని ఆరోపించారు. రూ.12 వేల కోట్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2009 నవంబర్ 29న ముఖ్యమంత్రి కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి కేంద్రంలో ప్రకంపనలు పుట్టించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. దీనికి ప్రతీకగా ప్రతి ఏటా నవంబర్ 29న దీక్ష దివస్ నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు చూపించిన పోరాటపటిమ, తెగువను వచ్చే ఎన్నికల్లో చూపించి దుబ్బాక గడ్డపై గులాబీ జెండాను ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్‌డిఒ అనంతరెడ్డిలతో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అక్బర్‌పేట-భూంపల్లి నూతన మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.వీరేష్‌ను మంత్రి, ఎంపి శాలువా కప్పి సన్మానించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, దుబ్బాక జెడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి, ఎంపిపి కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ కైలాష్ పాల్గొన్నారు.

నూతన క్రీడా విధానంపై సమీక్ష



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన క్రీడా విధానం రూప కల్పనపై రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఆ శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజుతో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం, కోచ్‌ల సంక్షేమం, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. వచ్చే క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నాటికి ముసాయిదా బిల్లును రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. క్రీడారంగ మేధావులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఒలింపియన్లు, అంతర్జాతీయ క్రీడాకారులను, సంప్రదించి వారి సలహాలను, సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో క్రీడలశాఖ సంయుక్త కార్యదర్శి కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డ్

ప్రముఖ సంస్థ స్కోచ్ గ్రూప్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డును సెట్విన్ సంస్థ ఎండి వేణుగోపాల్‌కు మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. నిరుద్యోగ యువతకు విరివిగా ఉద్యోగాలు కల్పిస్తున్నందుకు ఈ అవార్డు అందజేసినట్టు ఆయన తెలిపారు. సెట్విన్ సంస్థకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

'త్రిబుల్‌ఆర్' బలవంతపు భూసేకరణ ఆపాలి

- నిర్వాసిత రైతులకు మార్కెట్ రేటుకు మూడింతల పరిహారం చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్
- నాయకులు, రైతుల అక్రమ అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లో రీజినల్ రింగ్ రోడ్డు పేరిట సేకరిస్తున్న బలవంతపు భూసేకరణను వెంటనే ఆపాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్రిబుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు మద్దతుగా సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు సర్వే జరుగుతున్న గిర్మాపూర్ శివారు ప్రాంతాన్ని బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న సర్వే పనుల్ని ఆపాలని డిమాండ్ చేశారు. రైతులు, సిపిఎం, రైతు సంఘం నాయకుల్ని సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు అడ్డుకున్నారు. సర్వే ప్రాంతం నుంచి బలవంతంగా లాక్కెళ్లారు. ప్రశ్నిస్తున్న రైతులను, వారికి మద్దతుగా నిలబడ్డ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి బుదేరా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. త్రిబుల్‌ఆర్‌లో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూముల సర్వే చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రమేయం లేకుండా వారి పంట పొలాల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. పోలీసు బలగాలతో రైతుల్ని భయభ్రాంతులకు గురి చేస్తూ సర్వే చేయడం అన్యాయమన్నారు. చట్ట ప్రకారం రైతులతో గ్రామసభ నిర్వహించి రైతుల అభిప్రాయం మేరకే సర్వే, భూసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి సున్నం పెట్టే ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి లేదా మార్కెట్ రేటుకి మూడింతలు అదనంగా చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే రైతులతో చర్చలు జరిపి చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని, లేకపోతే భవిష్యత్తులో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం కొండాపూర్ మండల కార్యదర్శి కే.రాజయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.నరసింహారెడ్డి, సిపిఎం నాయకులు రామచందర్, బాబూరావు, గ్రామ రైతులు జయరాములు, మహేష్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్వింటా ధాన్యం రూ.1700లకే...

- షావుకార్లు, మిల్లర్లకు అమ్ముకుంటున్న కౌలు రైతులు
- మిల్లుల్లో జాగలేదని, తేమశాతం ఇంకా రాలేదన్న సాకులు..
- లక్ష్యం అంచనాలో ఇప్పటివరకు సర్కారు సేకరించింది పది శాతమే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది కౌలు రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు సిద్ధమైన సర్కారు.. పలు నిబంధనల నడుమ పంట డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. అందుకు వ్యవసాయశాఖ, రైతుసమన్వయ సమితి సభ్యుల ధ్రువీకరణతో కూడిన రెండు పత్రాలు తీసుకొస్తేనే సెంటర్లలో ధాన్యం తూకం వేస్తున్నారు. ఈ తతంగానికి రోజుల తరబడి సమయం పట్టడం, భూయజమానుల ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబర్లు లేకపోవడం, ఉన్నా.. సమయానికి ఒటిపి చెప్పలేని పరిస్థితుల్లో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు సాదాబైనామా భూములు, పట్టాపాసుపుస్తకం లేని వారు, మ్యూటేషన్, విరాసత్‌కాని రైతులైతే.. అటు యజమానులు కాక, ఇటు కౌలురైతులుగా ధ్రువీకరణ తెచ్చుకోలేక 'అగ్గువకో.. సగ్గువకో..' ధాన్యాన్ని షావుకార్లకు, మిల్లర్లకే అమ్ముకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం లక్ష్యంలో కనీసం పది శాతమూ లేకపోవడానికి అద్దం పడుతోంది.

వానాకాలం ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఈ నెల రెండో వారం నుంచి అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకుంటూ వస్తోంది. ఇప్పటివరకు కోతలకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో అవసరం మేర సెంటర్లను ప్రారంభిస్తున్నట్టు ఇటీవల మంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నిర్దేశించుకున్న సెంటర్లలో సగానికిపైగా ప్రారంభించి పట్టాపాసుబుక్కు ఉన్న రైతుల నుంచే క్వింటాల్ ధాన్యానికి రూ.2060 మద్దతు ధర చెల్లిస్తూ సేకరిస్తోంది. ఎఇఒలు, రైతుసమన్వయ సమితి సభ్యులు ధ్రువీకరణతో వచ్చిన కౌలుదార్ల నుంచీ కొనుగోలు చేస్తోంది. గత సీజన్ వడ్లతో నిండిపోయిన మిల్లుల్లో జాగ లేదని, తేమ శాతం ఇంకా రాలేదని కొర్రీలు పెడుతున్న సెంటర్లలో ధాన్యం సేకరణ నత్తనకడన సాగుతోంది. దీంతో రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు కాయలేని రైతులు, కౌలుదార్లు తూకంలో కోతలు, తేమశాతం లెక్కల్లేకుండానే క్వింటా ధాన్యాన్ని (రకం, నాణ్యతను బట్టి) రూ.1650 నుంచి రూ.1800లోపే మిల్లర్లకు అమ్ముకుంటున్నారు.

కౌలు రైతుకు వచ్చిన పెద్దకష్టం

గతేడాది వరకూ ధాన్యం సేకరణలో కౌలు రైతులను లెక్కలోకే తీసుకోలేదు. భూమి విస్తీర్ణం, పట్టాపాస్‌బుక్కు, ఆ భూయజమాని ఆధార్, ఖాతా నెంబర్లను తీసుకునే కౌలురైతులు తెచ్చిన ధాన్యాన్ని తూకం వేసి డబ్బులు యజమాని ఖాతాల్లోనే జమ చేశారు. ఇందులో రైతుల మధ్య గొడవలు రావడం, యజమాని అందుబాటులో ఉండకపోవడంతో కొంత నిబంధనల నడుమ కౌలురైతు ఖాతాలో డబ్బులు వేసేందుకు ఈ ఏడాది ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించింది. ఇందుకు ఫారం-1, 2 పత్రాలలో వ్యవసాయాధికారులు, రైతు సమన్వయసమితి సభ్యుడు యజమాని భూసర్వేనెంబర్, విస్తీర్ణం లెక్కలు తీసి, అది కౌలు తీసుకున్న రైతు పేరును నమోదు చేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. అయితే సదరు భూయజమాని ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌నెంబర్‌కు వెళ్లిన ఒటిపిని నమోదు చేయాల్సి ఉంది. ఇక్కడే కొన్ని చోట్ల యజమానులు అందుబాటులో ఉండకపోవడం, నిమిషం వ్యవధిలోనే సదరు యజమాని ఒటిపి చెప్పడం వంటి ప్రక్రియ రోజులతరబడి సమయాన్ని వృథా చేస్తోంది. దాంతో సెంటర్లలో ధాన్యం అమ్ముకునే బదులు క్వింటా రూ.1800 అయినా మిలర్లలకే అమ్ముకుంటున్నారు.

పట్టా, మ్యూటేషన్, విరాసత్ లేకుంటే అంతే..!

ధరణి పోర్టల్ వచ్చిన తరువాత అంతకు ముందు సాదాబైనామాల ద్వారా క్రయవిక్రయాలు జరిగిన వ్యవసాయ భూముల వివరాలు చాలా వరకు వ్యవసాయశాఖ రికార్డుల్లో నమోదు కాలేదు. రైతుబంధు దరఖాస్తు చేసుకునే వీలు లేకపోవడంతోపాటు ఇతర కారణాల వల్ల మ్యూటేషన్, విరాసత్ అయిన భూములూ రికార్డుల్లో లేవు. సదరు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తమ ఆధార్ నెంబర్ ఇస్తే.. కేవలం రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న భూముల వివరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. దాంతో వారు పండించిన ధాన్యం సేకరించేందుకు వీలులేకుండా పోయింది. వీరంతా పడావుగా ఉన్న భూముల యజమానుల పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చుకుని కొందరు అతికష్టంమీద పంటను అమ్ముకుంటున్నారు. ఈ వ్యయ ప్రయాసాలెందుకని మిల్లర్లకే తక్కువకు అమ్ముకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో అనేక మంది కౌలుదారులు మిల్లులకు అమ్ముకుంటున్నారు. క్వింటాకు 5 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలోని 30వేలకు పైగా ఉన్న కౌలుదారులందరూ ఇలాగే నష్టపోతున్నారు.



కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలు

జిల్లా	కొనుగోలు కేంద్రాలు	ప్రారంభించిన సెంటర్లు	ధాన్యం సేకరణ లక్ష్యం(మె.టన్నుల్లో)	రైతులు	సేకరించిన ధాన్యం (క్వింటాళ్లలో)
కరీంనగర్	353	333	4.46లక్షలు	8358	55,442
సిరిసిల్ల	259	251	3.5లక్షలు	6130	42,888
పెద్దపల్లి	303	274	3.5లక్షలు	531	18,807
జగిత్యాల	427	417	4లక్షలు	5992	50,416

వచ్చినకాడికి సాలనే..!

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేస్తలేరు. తేమ రాలేదని, మిల్లుకాడ జాగలేదని చెబుతున్నరు. తూకం వేసినా కోత పెడుతామంటున్నరు. ఇన్ని కష్టాలు పడుడెందుకని వచ్చినకాడికి సాలని క్వింటాల్ రూ.1680 చొప్పున మిల్లోల్లకే అమ్మిన.

- రాజన్న, మానకొండూర్, కరీంనగర్ జిల్లా

కౌలుపత్రాలు తేలేకనే..

ఇద్దరి దగ్గర ఏడు ఎకరాలు కౌలుకు తీసుకున్న. అండ్ల పండిన వడ్లను అమ్మేందుకు సార్ల దగ్గర సంతకాలు తెమ్మన్నరు. వాళ్లు దొరుకతలేరు. ఈ లొల్లంతా ఎందుకని సావుకారికే 300 బస్తాలు అమ్మిన. క్వింటల్ వడ్లకు రూ.1900 కట్టి ఇచ్చిండు.

- తిరుపతి, లలితపల్లె, ఎలిగేడు(మం), పెద్దపల్లి జిల్లా.

యూనిట్‌కు 30 పైసలు...మీరే పెంచుకోండి

- ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతినెలా బాదుడు
- డిస్కంలకు టిఎస్ఇఆర్‌సి అనుమతి
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి...
- టారిఫ్ పెంచమని ప్రతిపాదించలేదు...
- విచారణ చేస్తాం : ఇఆర్‌సి చైర్మన్ శ్రీరంగారావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో అమల్లో ఉన్న ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్ఎస్ఎ) ఇప్పుడు మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో అమల్లోకి వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టిఎస్ఇఆర్‌సి) ముసాయిదా ప్రతిపాదనలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీన్ని ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెచ్చుకోవచ్చని టిఎస్ఇఆర్‌సి చైర్మెన్ టీ శ్రీరంగారావు తెలిపారు. ఇంధన కొనుగోలు వ్యయం సర్దుబాటు (ఎఫ్ఎస్ఎ) కోసం ప్రతినెలా యూనిట్‌కు 30 పైసల వరకు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) పెంచుకోవచ్చని, ఆపై మొత్తం పెంచాల్సి వస్తే తమ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. డిస్కంలు ప్రతినెలా అదనంగా వసూలు చేసే ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఎ) వివరాలను తమ సంస్థల వెబ్‌సైట్లలో పెట్టాలని చెప్పారు. ఎంత చార్జీ, ఎందుకు వసూలు చేస్తున్నారు... అనే వివరాలు దానిలో ఉండాలన్నారు. అలాగే ప్రయివేటు డిస్కంల ఏర్పాటు ప్రతిపాదనలు కేంద్రం నుంచి వచ్చాయనీ, వాటిని పరిశీలిస్తున్నామని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలను రాష్ట్రంలోని రెండు డిస్కంలు బుధవారం టిఎస్ఇఆర్‌సి చైర్మెన్ టి శ్రీరంగారావు, సభ్యులు (టెక్నికల్) ఎమ్‌డీ మనోహరరాజుకు డిస్కంల వాణిజ్య విభాగం అధికారులు గణపతి, స్వామిరెడ్డి సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరంగారావు మీడియాతో మాట్లాడారు. డిస్కంలు ఇచ్చిన ఎఆర్ఆర్‌లో చార్జీలు పెంచాలని ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదనీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సర టారిఫ్‌నే అమలు చేస్తామని పేర్కొన్నాయని వివరించారు. ప్రతినెలా వసూలు చేసే ఎఫ్ఎస్ఎ సొమ్మును ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమచేసి, డిస్కంలు తమకు లెక్కలు చెప్పాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎటి అండ్ సి నష్టాలు 15 శాతానికి తగ్గించుకోకుంటే, అలాంటి లెక్కల్ని తాము పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. వీటి తగ్గింపు కోసం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగంపై డిస్కంల దగ్గర పక్కా లెక్కలు లేవనీ, అందువల్ల ప్రతి వ్యవసాయ ట్రాన్స్‌ఫారమ్ వద్ద మీటర్లు పెట్టాలనే తమ ఆదేశాలను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. మూడు లక్షల డిటిఆర్‌ల వద్ద మీటర్ల ఏర్పాటుకు 2024 డిసెంబర్ వరకు డిస్కంలకు గడువు ఇచ్చామన్నారు. 500 యూనిట్లు దాటే ప్రతి వినియోగదారుడికి స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఆదేశించామనీ, డిస్కంలు ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో చేరాయో లేదో తమకు సమాచారం లేదన్నారు. ప్రీ పెయిడ్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలు సహా పలుచోట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించామనీ, అయితే ప్రీ పెయిడ్ మీటర్లలో సాంకేతికత మరింత అప్‌గ్రేడ్ కావాల్సి ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇఎస్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన 15 వేల ప్రీపెయిడ్ మీటర్లు సక్రమంగా పనిచేయట్లేదనీ, వాటిని తొలగించాలని అక్కడి డిస్కంలు కోరుతున్నాయన్నారు. ఆ అనుభవాల దృష్ట్యా ప్రీ పెయిడ్ మీటర్లు మరింత సాంకేతికాభివృద్ధి సాధించాకే ఇక్కడ ఏర్పాటు చేస్తే బాగుటుందని అభిప్రాయపడ్డారు.

ఎఆర్ఆర్‌లపై విచారణ చేస్తాం

డిస్కంలు ఇచ్చిన 2023-24 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలను పరిశీలించి, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచుతామని శ్రీరంగారావు తెలిపారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించి, బహిరంగ విచారణలు నిర్వహిస్తామని చెప్పారు. డిస్కంలు చార్జీలు పెంచాలని ప్రతిపాదించకున్నా, విచారణల్లో వచ్చిన అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రార్థనా మందిరాలకు కరెంటు చార్జీలు తగ్గించాలనీ, వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా అవసరం లేదనే ప్రతిపాదనలు తమకు అందాయని వివరించారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని చార్జీలపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు.

ఇవీ డిస్కంల ప్రతిపాదనలు (2023-24)

విద్యుత్ అవసరాలు	-	83,113 మి.యు
అమ్మకాల అంచనా	-	73,618 మి.యు
వార్షిక ఆదాయ అవసరాలు	-	రూ.54,060 కోట్లు
ప్రస్తుత టారిఫ్ అమలు		
ద్వారా వచ్చే సొమ్ము అంచనా	-	రూ.43,525 కోట్లు
రెవెన్యూ గ్యాప్	-	రూ.10,535 కోట్లు
ప్రభుత్వం నుంచి వస్తుందని		
ఆశిస్తున్న సబ్సిడీ	-	రూ.10,535 కోట్లు
ఒక యూనిట్ కరెంటు		
సరఫరాకు అవుతున్న ఖర్చు	-	రూ.7.34 పైసలు
డిస్కంల వారీ లెక్క ఇదీ...		
ఆదాయ అవసరాలు		
టిఎస్‌పిడిసిఎల్	-	రూ.36,963 కోట్లు
టిఎస్ఎన్పీడిసిఎల్	-	రూ.17,095 కోట్లు
మొత్తం (సర్దుబాటు)	-	**రూ.54,060 కోట్లు**
2022-23లో యూనిట్		
కాస్ట్ ఆఫ్ సర్వీస్	-	రూ.7.03 పైసలు
2023-24 ప్రతిపాదన	-	రూ.7.73 పైసలు
ఏడాదిలో పెరిగింది	-	రూ.0.31 పైసలు



సచివాలయ పనులను పరిశీలిస్తున్న మంత్రి

అంబేద్కర్‌పై గౌరవంతోనే కొత్త సచివాలయానికి పేరు

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డా.బిఆర్ అంబేద్కర్ నూతన సెక్రటేరియట్ నిర్మాణ పురోగతి పనులను బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా సుమారు మూడున్నర గంటల పాటు కలియతిరిగారు. ప్రణాళికా ప్రకారం అంతస్థులవారీగా పనుల పురోగతి పరిశీలించారు. అనంతరం అక్కడే ఆర్‌అండ్‌బి అధికారులతో, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ విధించిన నిర్ణీత గడువులోపు అన్ని రకాల నిర్మాణ పనులు పూర్తి కావాలని అధికారులను, వర్క్ ఏజెన్సీని ఆదేశించారు. బ్లాకుల వారిగా, ఫ్లోర్‌వైజ్ పనులు సమాంతరంగా నాణ్యతతో జరగాలన్నారు. రెడ్ సాండ్ స్టోన్, క్లాడింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. మెయిన్ ఎంట్రన్స్, పోర్టికో మెట్ల మార్గంతో పాటు అన్ని ఫ్లోర్లలో ఫ్లోరింగ్ పనులు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. నెలలోపు ఫాల్స్ సీలింగ్ వర్క్స్ పూర్తి కావాలనీ, అదే గడువు వరకు రెయిలింగ్ ఫిక్సింగ్ కోసం సిద్ధం చేయాలని సూచించారు. మెయిన్ గ్రాండ్ ఎంట్రీ, ఫౌంటెన్ నిర్మాణం, డొమ్స్, ఎలక్ట్రికల్ వర్క్స్, బ్లాకులవారీగా జరుగుతున్న పలు ఫినిషింగ్ పనులపై అధికారులతో కూలంకషంగా, సుదీర్ఘంగా చర్చించారు. అన్ని రకాల పనులు సమాంతరంగా మూడు షిఫ్టుల్లో జరగాలనీ, అవసరమైతే వర్కర్లను పెంచుకోవాలని సూచించారు. కెసిఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కట్టడం నిర్మిస్తున్నదనీ, చారిత్రాత్మక ఈ ప్రభుత్వ పరిపాలన భవన నిర్మాణానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు నామకరణం చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి, ఎస్ఈలు సత్యనారాయణ, లింగారెడ్డి పలువురు పాల్గొన్నారు.

సృజనాత్మక రచన కోర్సునందించాలి

- అల్లం నారాయణతో జర్నలిజం విద్యార్థుల ముఖాముఖి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సిటీ కాలేజీ జర్నలిజం విద్యార్థులు బుధవారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య ముఖాముఖి జరిగింది. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. ఎలక్ట్రానిక్ మీడియా సంచలన విషయాలకు, సినిమా క్రీడాకారుల వ్యక్తిగత విషయాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. అన్ని పత్రికల్లో జిల్లా సంచికలు రావటం వల్ల గ్రామీణ విలేకరుల ఆవశ్యకత పెరిగిందనీ, వీరికి తగిన వృత్తిగత నైపుణ్యాలను అందించటం, వారి సంక్షేమ బాధ్యతలను నిర్వహించటంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ తగిన చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. గ్రామీణ విలేకరులలో భాషా పరమైన నైపుణ్యాలను పెంచటం కోసం మీడియా అకాడమీ ప్రత్యేకంగా వాచకాలను రూపొందించిందని అన్నారు . విద్యార్థులు తమ సొంత అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి సామాజిక మాధ్యమాలను వినియోగించవచ్చన్నారు. వాటి ద్వారా వేగంగా భావజాల ప్రసారం సాగుతుందని అన్నారు. మీడియా, రాజకీయాలు తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన చాలా ఓపిక సమాధానమిచ్చారు. ముఖాముఖీలో అల్లం నారాయణతో సంభాషించిన విద్యార్థులు ఈ కార్యక్రమం తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా సిటీ కళాశాల తెలుగు విభాగం ప్రెస్ అకాడమీతో కలసి సృజనాత్మక రచన సర్టిఫికేట్ కోర్సును నిర్వహించాలని ప్రతిపాదించగా , ఆయన ఆమోదం తెలిపారు.

కవిత.. మీ ఆస్తులెన్నో చెప్పండి

- కాంగ్రెస్ నేత మహేష్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం రాక ముందు, ఆ తర్వాత మీ ఆస్తులెన్నో చెప్పాలంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. దీనిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేత మెట్టు సాయికుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ద్రోహులు అని చెప్పడమంటే చరిత్రను వక్రీకరించడమేనన్నారు. సోనియాగాంధీ దయవల్లే తెలంగాణ సిద్ధించిందంటూ సిఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన విషయాన్ని కవిత మర్చిపోయారని విమర్శించారు. కవిత పుట్టక ముందే ఇందిరాగాంధీ బతుకమ్మ ఆడారని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 80శాతం మంది ప్రస్తుత మంత్రులు ఆనాడు ఉద్యమకారులపై రాళ్లు వేసిన వారేనని గుర్తు చేశారు.

కల్యాణి, శ్రీరామమూర్తికి పురస్కారాలు

ప్రజాశక్తి - కల్చరల్

ప్రఖ్యాత రంగస్థల ప్రయోక్తలు రసరంజని నాటక సంస్థ వ్యవస్థాపక భాగస్వామ్యులు గరిమెళ్ళ రామమూర్తి 86వ జయంతి, చాట్ల శ్రీరాములు 91వ జయంతి ఉత్సవం డిసెంబర్ 5న రవీంద్రభారతి ప్రధాన వేదికపై రసరంజని నిర్వహణలో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రమణ, కార్యదర్శి ముట్నూరి కామేశ్వర రావుతో కలసి పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. డిసెంబర్ 5న నిర్వహించే జయంతి వేడుకల్లో గరిమెళ్ళ రామమూర్తి రంగస్థల పురస్కారాన్ని నటి, తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల విభాగం ఆచార్యులు అన్నలూరి కల్యాణికి పదివేల నగదుతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. అదే వేదికపై చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్‌తో కలసి చాట్ల ప్రతిభా పురస్కారంగా రంగస్థల కళాకారుడు నిట్టల శ్రీరామ మూర్తికి రూ.20వేల నగదుతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాధినేని శ్రీజ దర్శకత్వంలో సందడే సందడి నాటికను ప్రదర్శించనున్నారు. విలేకరుల సమావేశంలో మోహన్ సేనాపతి, శర్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తాం

- రైతు సంఘం రాష్ట్ర మహాసభ విజయవంతం
- ఈ నెల 5న అఖిల భారత అమరవీరుల జ్యోతి యాత్ర
- ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ
- కార్యాచరణ ప్రకటించిన రైతు నేతలు సారంపల్లి, సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ చెప్పారు. నల్లగొండలో మూడు రోజులపాటు నిర్వహించిన రైతు సంఘం రాష్ట్ర మహాసభ విజయవంతమయ్యాయని వారు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాసభల్లో చేసిన తీర్మానాలను, కార్యాచరణను రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి సారంపల్లి, సాగర్ మీడియాకు వెల్లడించారు. రైతు సమస్యలపై చర్చించిన మహాసభ భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించిందని చెప్పారు. వివిధ సమస్యలపై 29 తీర్మానాలను ఆమోదించిందని తెలిపారు. 87 మందితో నూతన కార్యవర్గాన్ని, 29 మందితో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌ను, ఇద్దరు శాశ్వత ఆహ్వానితులుగా ఎన్నుకుందని చెప్పారు.

ఉద్యమ కార్యాచరణ ఇలా...

అఖిల భారత అమర వీరుల జ్యోతి యాత్ర

ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభ సందర్భంగా అమర వీరుల జ్యోతియాత్ర డిసెంబర్ 5న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్వగ్రామం కడవెండి (జనగామ జిల్లా) నుంచి ప్రారంభమవుతుంది. మోత్కూరు (భువనగిరి), గుండ్రాంపల్లి (నల్గొండ)తోపాటు నల్గొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో సభలను నిర్వహిస్తాం. ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని త్రిసూల్ వరకు కొనసాగుతుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

రాష్ట్రంలో మద్దతు ధరలకే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్ణయించినప్పటికీ అనేక కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని మహాసభ నిర్ణయించింది.

ధరణి సమస్యల పరిష్కారం కోసం...

ధరణి సమస్యల వల్ల అనేక గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాటి పరిష్కారానికి విస్తృతంగా గ్రామాల్లో పర్యటించడం సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది.

రైతు-సిఐటియు-వ్యవసాయ కార్మిక సంఘం సంఘర్ష్ ర్యాలీ

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ ఏప్రిల్ 5న ఢిల్లీలో ఉంటుంది. ఆ లోపు రాష్ట్ర, జిల్లా, మండల సదస్సులు జరపాలి. విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి.

తెలంగాణపై 'మోడీ' కుట్రలు మానాలి

- కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోడీ కుట్రలు మానుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు అడ్డదారులు తొక్కడం తగదని బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్రంలో పరిపాలనను అస్థిరపరచడంతోపాటు ప్రభుత్వాన్ని కూలదోసేలా రాజ్యాంగ వ్యవస్థలైన ఐటి, ఇసి, ఇడి, సిబిఐ, గవర్నర్ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక, రాజకీయ, అనైతిక చర్యలతో ముప్పేట దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు దేశం అప్పు రూ.55 లక్షల కోట్లుంటే, ఇప్పుడు రూ.155 లక్షల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఎనిమిదేండ్ల కాలంలో రూ.100 కోట్ల అప్పులు చేసిన ఘనులు తెలంగాణ నిధులు అడ్డుకుంటారా? అంటూ అడిగారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలు అమలను చేయాలని కోరారు. కేంద్ర దుర్నీతిని రాష్ట్ర ప్రజలు అంగీకరించబోరని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా రాష్ట్రానికి వివిధ రూపాల్లో రావాల్సిన రూ.50 వేల కోట్ల వరకు నిధుల విడుదలకు మోకాలడ్డుతున్నదని విమర్శించారు. పాదయాత్ర పేరుతో బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కేంద్రం దుర్నీతి, కుట్రలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలకు సంసిద్ధమవుతుందని హెచ్చరించారు.

డిఎస్‌సి-2008 అభ్యర్థులకు ఉద్యోగాలివ్వండి

- సిఎంకు చాడ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఎస్‌సి-2008 కామన్ మెరిట్ జాబితాలో ఎంపికై పెండింగ్‌లో ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో నియామకాల ప్రక్రియ కొనసాగినందున అప్పుడు మిగిలిపోయిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా నియామకాలు చేపట్టి ఉద్యోగాలిచ్చిందని గుర్తు చేశారు. 2015లో కెసిఆర్ దృష్టికి ఈ అంశాన్ని తెచ్చినప్పుడు సానుకూలంగా స్పందించారన్నారు. డిఎస్‌సి-2008 నోటిఫికేషన్ ప్రకారం కామన్ మెరిట్‌లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులందరికీ నియామకాలు చేపట్టాలనీ, ఉద్యోగాలిచ్చి న్యాయం చేయాలని కోరారు.



నిర్బంధంలో విద్యుత్ సిబ్బంది

విద్యుత్ సిబ్బంది నిర్బంధం

- విద్యుత్ కనెక్షన్లు తొలగించారని..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ కనెక్షన్లు తొలగించడాన్ని నిరసిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామస్తులు విద్యుత్ సిబ్బందిని బుధవారం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో నాలుగు రోజుల కిందట వ్యవసాయ బావుల విద్యుత్ కనెక్షన్లను రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు తొలగించారు. దాంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సుమారు రెండు గంటలపాటు నిరసన వ్యక్తం చేసినా ఎవరూ రాకపోవడంతో విద్యుత్ సిబ్బందిని నిర్బంధించారు. అనంతరం భువనగిరి ఎఇ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులతో చర్చించారు. విద్యుత్ కనెక్షన్స్ పునరుద్ధరించారు. హెల్పర్ వెంకటరెడ్డి దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఎఇకి ఫిర్యాదు చేశారు. సుమారు 40 ఏళ్ల కిందటి నుంచి వినియోగంలో లేని బావుల కలెక్షన్లకు బిల్లులు చెల్లించాలని, దానికి సంబంధించిన వ్యక్తిని విచారించకుండా ఇతరుల విద్యుత్ కలెక్షన్లు తొలగించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారుల తీరు మార్చుకోవాలని కోరారు.

రేపు కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- కేంద్రం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- అదేరోజు హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్టు పలు కార్మిక సంఘాలు ప్రకటించాయి. బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బాలరాజు, హెచ్ఎమ్ఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు ఎమ్‌బి విజయకుమార్, ఐఎఫ్‌టియు కార్యదర్శి ఎమ్ శ్రీనివాస్, ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ బాబురావు, ఐఎఫ్‌టియు అధ్యక్షులు ఆరెళ్ల కృష్ణ, ఐఎఫ్‌టియు ఉపాధ్యక్షురాలు అరుణ, రాష్ట్ర కమిటీ సభ్యులు వి ప్రవీణ్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబర్ 2న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలనీ, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలనీ, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలనే పలు డిమాండ్లతో ఈ ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆందోళనల్లో భాగంగా హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో డిసెంబర్ రెండున అన్ని కార్మిక సంఘాల సంయుక్తాధ్వర్యంలో నిరసనలు, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లోనూ సంయుక్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతారని వివరించారు. ఈ ఆందోళనల్లో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

ఉపకార వేతనాలకు కేంద్రం మంగళం

- ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను యథాతథంగా కొనసాగించాలి : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివే పేద విద్యార్థులకు ఇచ్చే ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలను ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆ ఉపకార వేతనాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మంగళం పాడిందని విమర్శించింది. ఈ మేరకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లోని ఎస్‌సి, ఎస్‌టి నిరుపేద విద్యార్థుల్లో బాలికలకు రూ.1,500, బాలురకు రూ. వెయ్యి చొప్పున ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను కేంద్రం మంజూరు చేస్తుందని గుర్తు చేశారు. అయితే విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉచిత నిర్బంధ విద్య అమలు చేస్తున్నందున ఉపకార వేతనాలు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ, నిలిపేయాలంటూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటం అన్యాయమని విమర్శించారు. విద్యా హక్కు చట్టం చేసి 12 ఏండ్లయినా ఇప్పటి వరకు సక్రమంగా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ చట్టం అమలుకు ప్రత్యేకంగా నిధులనూ కేంద్ర ప్రభుత్వం కేటాయించలేదని తెలిపారు. 2014 నుంచి దాని అమలుపై తీవ్రమైన నిర్లక్ష్యంతో వ్యవహరించిన కేంద్రం హఠాత్తుగా ఆ చట్టం సాకుతో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉపకరించే కొద్దిపాటి సహాయాన్ని నిలిపేయాలంటూ నిర్ణయించటం దారుణమని విమర్శించారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల మంజూరును యథాతథంగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

కొత్తగా మూడు ప్లాంట్లు ఏర్పాటు

- ఎంవైకె లాటిక్రెట్ ఎండి వెల్లడి



హైదరాబాద్ : టైల్స్, రాళ్లను అతికించే ఉత్పత్తుల తయారీదారు ఎంవైకె లాటిక్రెట్ వచ్చే ఏడాది కాలంలో రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. తమ సంస్థ బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ క్రికెటర్ ఎంఎస్ ధోనినీ నియమించుకున్నట్లు ఎంవైకె లాటిక్రెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురళి యాదవ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికే తమకు హైదరాబాద్, కోయంబత్తూరు, గుజరాత్‌లో ఒక్కోటి చొప్పున, రాజస్థాన్‌లో రెండు ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. కొత్తగా ఇండోర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో కొత్తగా మూడు ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వీటికి రూ.300-400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 23 గిడ్డంగులు, 25వేల మంది రిటైలర్లను కలిగి ఉన్నామన్నారు. ఈ రంగంలో 38 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్నామన్నారు. దేశ వ్యాప్తంగా సంస్థకు 1,000 మంది ఉద్యోగులున్నారని.. ఈ సంఖ్యను మరో 500 పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో కొత్తగా హైదరాబాద్‌లోనే 250 మంది ఉద్యోగులను జోడించుకోనున్నామని వెల్లడించింది.